క్లుప్తంగా

‘ఉపాధి’లో అవకతవకలపై చర్యలు తీసుకోండి



డ్వామా పీడీ రామచంద్రారెడ్డితో చర్చిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల(సెంట్రల్): నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో అక్రమాలు, అవకతవకలు చోటు చేసుకున్నాయని నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆయన డ్వామా పథక సంచాలకులు రామచంద్రారెడ్డిని బుధవారం కలిసి చర్చించారు. అవకతవకలపై తగిన విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పనుల గుర్తింపు, మస్టర్ల తయారీలో అక్రమాలు జరిగాయని పీడీకి వివరించారు.

సమయం పొడిగించాలి

నంద్యాల(న్యూటౌన్): గ్రూప్–2 మెయిన్స్ పరీక్షకు అదనపు సమయం పొడిగించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న కోరారు. బుధవారం మధుశేఖర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. గ్రూప్–2 మెయిన్స్ పరీక్షను జూలై 28 నుంచి నిర్వహిస్తామని ప్రకటించారన్నారు. ఎన్నికలు జరిగిన దృష్ట్యా అభ్యర్థులు సిలబస్ ప్రిపరేషన్‌లో ఇబ్బందులు పడ్డారని, మరో రెండు నెలలు వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో హరిబాబు, శివ, సాయికృష్ణ, రాజు, సందీప్, సుదర్శన్ పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు విడుదల చేయాలి



డీఈఓ సుధాకర్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పెండింగ్‌లో ఉన్న పాఠ్య పుస్తకాలను తక్షణమే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డీఈఓ సుధాకర్‌రెడ్డికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు పూర్తి స్థాయిలో రాకపోవటంతో బోధన సక్రమంగా సాగడం లేదన్నారు. కొత్త ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, దుస్తులు, కిట్లు ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. నాయకులు వినయ్, మహేంద్ర, చరణ్ పాల్గొన్నారు.

రైతుకు న్యాయం చేయాలి



జేసీతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ భూమిని సాగుచేసుకుంటున్న రైతు వడ్డె సుబ్బరాయుడికి న్యాయం చేయాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం జేసీ రాహుల్ కుమార్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. సీపీఐ కార్యదర్శి రంగనాయుడు, బాబా ఫక్రుద్దీన్, సోమన్న, భాస్కర్, హరినాథ్ మాట్లాడుతూ.. సర్వే నంబరు 693లోని భూమిని 30 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న సుబ్బరాయుడు నుంచి దౌర్జన్యంగా అదే గ్రామానికి చెందిన వ్యక్తి పట్టాదారు పాసుపుస్తకాలు తయారు చేసుకుని రైతు కుటుంబాన్ని భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ సుబ్బరాయుడు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల–జమ్మలమడుగు ఆర్అండ్‌బీ రహదారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు.. బనగానపల్లె పట్టణానికి చెందిన శంకరమ్మ, సుబ్బరాయుడు కుటుంబాలు వంటసామాగ్రి అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఉదయం ఆటోలో జమ్మలమడుగువైపు వెళ్తుండగా మండలంలోని గుళ్లదూర్తి– అల్లూరు గ్రామాల మధ్య సుబ్బరాయుడు మూత్ర విసర్జనకు ఆటో దిగాడు. మిగిలిన వారు ఆటో పక్కన నిలిచి ఉన్నారు. కోవెలకుంట్ల వైపు నుంచి టాటాఏసీ ఆటో వేగంగా వెళ్తూ వారిపై దూసుకెళ్లింది. ప్రమాదంలో సుబ్బరాయుడికి రెండుకాళ్లు విరగ్గా, శంకరమ్మకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం నంద్యాలకు తరలించారు. రోడ్డు ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

మత్తు.. నూరేళ్ల జీవితం చిత్తు



ఆళ్లగడ్డలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



చాగలమర్రిలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

ఆళ్లగడ్డ: మత్తు పదార్థాల వినియోగంతో.. నూరేళ్ల జీవితం నాశనమవుతుందని ఎస్‌ఐ వెంకటరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మత్తు, మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ మాట్లాడుతూ యువత, విద్యార్థులు చెడు స్నేహాలతో సరదాగా ప్రారంభించిన మాదక ద్రవ్యాల వినియోగం వారి భవిష్యత్‌ను నాశనం చేస్తుందని గుర్తు పెట్టుకోవాలన్నారు. అక్రమంగా మాదక ద్రవ్యాలు రవాణా, విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం కళాశాల ఆవరణ నుంచి మొదలైన ర్యాలీ టీబీ రోడ్డు మీదుగా నాలుగు రోడ్ల కూడలివరకు సాగింది. వైపీపీఎం, ప్రజ్ఞ, కేవీ సుబ్బారెడ్డి కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

చాగలమర్రి: యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని అంధకారం చేసుకోవద్దని ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతు నాయక్, ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అడవి బిడ్డల ఆందోళన



రోడ్డుపై ధర్నా చేస్తున్న గిరిజనులు

శిరివెళ్ల: నల్లమల అటవీ ప్రాంతంలోని పచ్చర్ల అడవి బిడ్డలను చిరుత సంచారం ఆందోళన కల్గిస్తుంది. మంగళవారం చిరుత దాడిలో షేక్ మెహరూన్‌బీ మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం చిరుత బారి నుంచి తమను రక్షించాలని కోరుతూ గిరిజనులు నంద్యాల– ఒంగోలు రోడ్డుపై ధర్నా చేశారు. గత నెల రోజుల నుంచి అడవిలో చిరత సంచరిస్తుందని అధికారులకు తెలిసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబానికి తగిన న్యాయం చేయాలని కోరారు. ఇతర ప్రాంతం నుంచి చిరతను తెచ్చి ఇక్కడి అడవిలో వదిలారని చెప్పారు. కాగా.. చిరుత దాడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ బుధవారం తెలిపారు. షేక్ మెహరూన్‌బీ చిరుత దాడిలో మరణించడంపై ఆమె కూతురు రజియా ఫిర్యాదు చేసిందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మృతికి అధికారులదే బాధ్యత..

చిరుత దాడిలో షేక్ మెహరూన్‌బీ మృతికి పూర్తిగా అధికారులదే బాధ్యతని ఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్న అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నెల రోజుల నుంచి చిరుత అడవిలో తిరుగుతుందని పలువురిపై దాడి చేసిందని తెలిసినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని మండిపడ్డారు. విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి మృతురాలి కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. చిరుతను పట్టుకొని చెంచులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

క్రీడాకారులకు దుస్తుల అందజేత

నంద్యాల(న్యూటౌన్): ఈ నెల 27, 28,29 తేదీల్లో అనంతపురం జిల్లా ధర్మవరంలో జరిగే రాష్ట్రస్థాయి హాకీ సీనియర్ పోటీలకు నంద్యాల జట్టు పాల్గొంటుందని హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణక్యరాజు తెలిపారు. బుధవారం హాకీ క్రీడాకారులకు టీ షర్టులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తొలిసారి హాకీ పోటీల్లో నంద్యాల జట్టు పాల్గొంటుందని, విజేతలై జాతీయస్థాయికి కూడా ఎంపిక కావాలని ఆకాంక్షించారు. నంద్యాల, పాములపాడు క్రీడాకారులు జట్టులో అధికంగా ఉన్నట్లు తెలిపారు. స్టీఫెన్, దివాకర్, విల్సన్ ఉన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

గోస్పాడు: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని హెచ్‌ఎం నాగలక్ష్మి కోరారు. బుధవారం మండలంలోని దీబగుంట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి బడికిపోదాం కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేకంగా నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహిస్తుందని చెప్పారు. బడి ఈడు పిల్లలు బడుల్లో ఉండాలని, పెద్దలు పనులకు వెళ్లాలన్నారు. విద్యార్థులకు అవసరమయ్యే అన్ని రకాల వసతులను సమకూర్చడంతో పాటు నాణ్యమైన విద్యాబోధన ప్రభుత్వం అందిస్తుందని, పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి వివిధ తరగతుల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సౌభాగ్యలక్ష్మి తెలిపారు. 6, 8 వతరగతుల్లో ఎస్సీ, ఎస్టీ, 7వ తరగతిలో ఎస్సీ కేటగిరిల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తిగల విద్యార్థినులు దరఖాస్తు ఫారంతోపాటు ఆధార్‌కార్డు, కులధృవీకరణపత్రం, రెండు పాస్‌పోర్టుసైజు ఫొటోలు జతపరిచి ఈ నెల 28వ తేదీ సాయంత్రంలోపు పాఠశాలలో అందజేయాలన్నారు. 29వ తేదీన ఉదయం 10 గంటలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని వెల్లడించారు.

సికిల్‌సెల్ అనీమియాపై అవగాహన కల్పించండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు, డీఎంఅండ్‌హెచ్‌ఓ, సిబ్బంది

నంద్యాల టౌన్: సికిల్‌సెల్ అనీమియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించాలని కలెక్టర్ శ్రీనివాసులు వైద్య,ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ చాంబర్‌లో బుధవారం డీఎంఅండ్‌హెచ్‌ఓ, వైద్యశాఖ అధికారులతో కలిసి సికిల్‌సెల్ అనీమియా వ్యాధి నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరించారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శరదాబాయి, డాక్టర్ కాంతారావు నాయక్, మలేరియా అధికారి కామేశ్వర రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



మండలూరు గ్రామ సచివాలయంలో హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ

రుద్రవరం: విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఈఓపీఆర్డీ శ్రీనివాసశర్మ సచివాలయం ఉద్యోగులను హెచ్చరించారు. మండలంలోని మందలూరు గ్రామ సచివాలయాన్ని బుధవారం ఉదయం తనిఖీ చేశారు. ఉదయం 11 గంటల సమయానికి ఆయన వెళ్లగా అక్కడ కొందరు ఉద్యోగులు మాత్రమే విధుల్లో ఉన్నారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ ఇటీవల కొందరు ఉద్యోగుల నిర్లక్ష్యంపై ఫిర్యాదులు వస్తున్నాయని, నిర్ణీత సమయంలో రాకుండా, ఇష్టానుసారంగా వెళ్లి పోతున్నారన్నారు. చర్యల కోసం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. తనిఖీ సమయంలో ముగ్గురు మాత్రమే విధుల్లో ఉన్నారని మిగిలిన వారి విషయం అడిగితే సరైన సమాచారం ఇవ్వకపోవడంతో వారికి మెమోలు ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 1 నుంచి 26 వరకు హాజరు పట్టికల్లో ఉద్యోగుల సంతకాలు లేవని, అధికారులు పనుల నిమిత్తం బయటకు వెళ్లే సమయంలో రాసే మూవ్‌మెంట్ రిజిష్టర్ కూడా లేదని చెప్పారు.రిజిష్టర్లు సక్రమంగా నిర్వహించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

హాస్టళ్ల మెస్ బిల్లులు విడుదల చేయాలి

నంద్యాల అర్బన్: బీసీ సంక్షేమ హాస్టళ్ల మెస్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని ఏపీ నాన్ పొలిటికల్ విద్యార్థి జేఏసీ రాష్ట్ర నాయకులు రామినేని రాజునాయుడు కోరారు. నిత్యావసర ధరలు పెరగడంతో విద్యార్థులకు మెనూ ప్రకారం వడ్డించడం వార్డెన్లకు ఇబ్బందికరంగా మారిందన్నారు. ఈ మేరకు నిధులు మంజూరు చేయాలని జేఏసీ నాయకులు విజయవాడలోని బీసీ వెల్ఫేర్ శాఖ కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖరరావుకు మంగళవారం వినతి పత్రం అందించామని చెప్పారు. బుధవారం నంద్యాలలో రాజునాయుడు మాట్లాడుతూ మెస్ బిల్లులతో పాటు హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలన్నారు. గతంలో మాదిరిలాగే ప్రతి విద్యార్థికి కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఓబులేసు, రియాజ్, జయరాజ్, కన్నా, వెంకట్, ఫణీంద్రారెడ్డి పాల్గొన్నారు.

మాన్యం వేలాల్లో రూ.2లక్షల ఆదాయం



వేలం పాటలు నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

నంద్యాల అర్బన్: మండలంలోని చాబోలు గ్రామంలో వెలిసిన శ్రీ వేణుగోపాల, నాగేశ్వరస్వామి దేవస్థానాలకు చెందిన మాన్యం కౌలుకు నిర్వహించిన వేలాల్లో రూ.2 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ స్వర్ణముఖి తెలిపారు. బుధవారం స్థానిక వేణుగోపాల స్వామి ఆలయ ఆవరణలో 48 ఎకరాలకు వేలం పాటలు నిర్వహించారు. శ్రీ నాగేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూములు సుమారు 20 ఎకరాలకు సంబంధించి గతేడాది రూ. 3,23,000కు పోగా ఈ ఏడాది రూ. 5,26,500కు రైతులు దక్కించుకున్నారన్నారు. దీంతో గత ఏడాది కంటే రూ.2,03,500 పెరిగిందని చెప్పారు. శ్రీ వేణుగోపాల స్వామి ఆలయానికి చెందిన 28.34 ఎకరాలకు నిరుడు రూ.5,13,500 పోగా ప్రస్తుత ఏడాది రూ.5,16,000 వచ్చిందని, గత ఏడాది కంటే రూ.2,500 మాత్రమే పెరిగిందని వివరించారు. మొత్తం మీద రూ. 2.06 లక్షలు ఆదాయం సమకూరిందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు మధ్య వేలాలు నిర్వహించారు.

రోడ్డుపైనే గుర్రాలు.. తరచూ ప్రమాదాలు



రోడ్డుపైనే ఉన్న గుర్రాలు

మహానంది: పుణ్యక్షేత్రానికి నిత్యం వేలాది సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వాహనాలు అధిక సంఖ్యలో వస్తుంటాయి. అయితే మహానంది సమీపంలోని ప్రధాన దారిపై నిత్యం గుర్రాలు, గాడిదలు సంచరిస్తుండటంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఏడాది క్రితం బైక్‌పై వెళ్తున్న వెంకటేశ్వర్లు గుర్రాలు అడ్డురావడం వాటిని ఢీ కొనడంతో మృత్యువాత పడ్డాడు. అలాగే పదుల సంఖ్యలో ప్రయాణికులు, భక్తులు గాయపడ్డారు. దేవస్థానం అధికారులు, పోలీసులు స్పందించి గుర్రాలు, గాడిదల యజమానులతో మాట్లాడి రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

గడివేముల: విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని.. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని ఎంఈఓలు మేరీ సునీత, విమల వసుందర దేవి అన్నారు. బుధవారం గడివేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రగతికి దోహదపడాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందేలా చూడాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నిజాం ఇన్‌స్టిట్యూట్ నుంచి వచ్చిన ఫిజియోథెరపిస్టులు ఫిజియోథెరపీ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆరోగ్య జీవనానికి అవసరమైన వ్యాయామాలను తెలియజేశారు.

తోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఉయ్యాలవాడ: ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉద్యానవన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ రఘురాం, ఏపీఓ రవిప్రకాష్, కోర్సు డైరెక్టర్ పరమేశ్వరుడు సూచించారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో మండలంలోని టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం వందశాతం సబ్సిడీ వర్తింపజేస్తుందన్నారు. మామిడి, చీని, నిమ్మ, దానిమ్మ, సపోట, జామ, కొబ్బరి పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. వంద ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఇన్‌స్టిట్యూషన్ ప్లాంటేషన్ కింద మండలంలోని కొండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపిక చేశామని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మండలంలో అరవై వేల పనిదినాలను లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు.

తపాలా బీమా పథకాలను వినియోగించుకోండి



మద్దూరులో ర్యాలీ నిర్వహిస్తున్న తపాలా సిబ్బంది

చాగలమర్రి: గ్రామీణ తపాలా బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మండలంలోని మద్దూరు గ్రామ పోస్టాఫీసులో లభించే బీమా పథకాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 19–55 సంవత్సరాలలోపు వయస్సు గల పట్టభద్రులు, ఉద్యోగులకు ఈ బీమా పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అలాగే 19 – 65 సంవత్సరాల వయస్సు గల వారు ఏడాదికి రూ.329 చెల్లిస్తే రూ.5 లక్షలు, రూ.549 చెల్లిస్తే, రూ.10 లక్షలు, రూ.750 చెల్లిస్తే 15 లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందని చెప్పారు. స్థానిక పోస్టుమాస్టర్ మనోజ్ కుమార్, ఆళ్లగడ్డ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రామనాథ్, సిబ్బంది సాధిక్, భాస్కర్‌రావు, పెద్దరాజు పాల్గొన్నారు.

చిన్నపిల్లలతో పనులు చేయిస్తే చర్యలు



బడిబయట పిల్లలు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న నిర్మల

ఆళ్లగడ్డ: చిన్నపిల్లతో పనులు చేయిస్తే పనిలో ఉంచుకున్న వారిని, పనికి పంపిన కుటుంబ సభ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారి నిర్మల హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని సద్దాం కాలనీ, చింతకుంట రోడ్డుల్లో ఉన్న బడిబయట పిల్లల నివాసాలను ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ చిన్నారులు మత్తు పదార్థాలు పీలుస్తూ, తూలుతుండటం చూసి తల్లిదండ్రులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలను కాగితాలు ఏరుకునేందుకు, యాచనకు తీసుకెళ్లే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు. 3–6 ఏళ్ల లోపు వారిని అంగన్‌వాడీ కేంద్రాల్లో, 6 సంవత్సరాలు పైబడిన వారిని పాఠశాలల్లో చేర్పిస్తామని అందరు సహకరించాలని చెప్పారు. సీడీపీఓలు తేజేశ్వరి, ఉమామహేశ్వరి, సూపర్‌వైజర్ దస్తగిరమ్మ ఉన్నారు.

బీళ్లవుతున్నా పట్టించుకోరా?



క్రిష్టిపాడులో కలుపుతో నిండిన ఆలయ భూమి

దొర్నిపాడు: కొందరు అధికారుల తప్పిదం వల్ల ఆలయాల భూములు వేలం పాటలకు నోచుకోక బీళ్లవుతున్నాయి. రైతులు అడిగిన ప్రశ్నలకు తగిన బిల్లులు.. లెక్కలు చూపించలేక అధికారులు వేలాలను వాయిదా వేస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సమయం కావడంతో తొలకరి వర్షాలకు మాన్యం భూములన్నీ బీళ్లవుతున్నా దేవదాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని చాకరాజువేముల గ్రామంలోని శ్రీ గౌరీభోగేశ్వరస్వామి ఆలయానికి చెందిన 46 ఎకరాలు, శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయానికి చెందిన 38.14 ఎకరాలు వేలానికి నోచుకోలేదు. ఇందుకు కారణం చెన్నకేశవ స్వామి ఆలయానికి చెందిన సర్వే నంబర్ 606/ఎ2లో 19.81 ఎకరాల కౌలు వేలంలో రూ.3లక్షలు తేడా రావడంతో వాటికి లెక్కలు చూపాలని రైతులు వేలం పాటలను అడ్డుకున్నారు. అలాగే క్రిష్టిపాడులో నాగేశ్వరస్వామి ఆలయానికి చెందిన 25.62 ఎకరాలు, చెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన 26.42 ఎకరాలు కౌలుకు ఇవ్వలేదు. వాటికి సంబంధించిన లెక్కల్లో తేడాలుండటంతో అధికారులను రైతులు నిలదీయడంతో వేలాలు వేయకుండా నిలిపివేశారు. దీంతో మాన్యం భూములు బీడుగా మారుతున్నాయి.

నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఎస్‌సీ మార్కెటింగ్ మేనేజర్ శ్యామ్‌ప్రసాద్

పగిడ్యాల: రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని నేషనల్ సీడ్ కార్పొరేషన్ మార్కెటింగ్ మేనేజర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం వద్ద సీఈఓ ఖాజా అధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విత్తనాల ఎంపికలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పండించిన పంటను విత్తన ఉత్పత్తి చేస్తే మార్కెట్ ధర కంటే 20 శాతం అధికంగా కొనుగోలు చేస్తామని వెల్లడించారు. గింజలో తేమ శాతం 13 శాతం ఉండాలని నకిలి విత్తనాలు లేకుండా చూసుకోవాలన్నారు. సీడ్ కార్పొరేషన్ కొనుగోలు చేస్తే రైతులకు 80 శాతం వరకు ముందస్తు అడ్వాన్స్ ఇస్తోందన్నారు. ఆసక్తి కలిగిన రైతులు డీలర్ షిప్ తీసుకోవాలంటే రూ. 5 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉందన్నారు. డీలర్‌కు కేవలం 8 నుంచి 15 శాతం వరకు కమిషన్ ఇస్తామని స్పష్టం చేశారు. అన్ని రకాల విత్తనాలు ఉంటాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా సహకార బ్యాంక్ చీఫ్ మేనేజర్ సరోజమ్మ, ఇఫ్‌కో మార్కెటింగ్ మేనేజర్ మహేష్, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుళ్లిన మినుము పైరు



వర్షపు నీరు నిలిచిపోవడంతో కుళ్లిన మినుము పైరు

రుద్రవరం: మండలంలోని ఎర్రగుడిదిన్నె రైతులకు మినుము పంట కలిసి రావడం లేదు. గత రెండేళ్లుగా మినుము పంట సాగుతో నష్టపోతున్నారు. వేలాది రపాయులు పెట్టు బడులు పెట్టి కంటి రెప్పలా పంటను కాపాడుకుంటే ఏదో ఒక కారణంతో దిగుబడులు చేతికందకుండా పోతున్నాయి. ముందస్తు వానలు మురిపించడంతో రైతులు దాదాపు 350 ఎకరాల్లో మినుము పంట సాగు చేశారు. అయితే ఇటీవల రెండు విడతలుగా భారీ వర్షం కురిసింది. వారం,పది రోజుల పాటు వర్షపు నీరు పొలాల్లో నిలిచిపోయింది. నీరు వెళ్లే మార్గం లేకపోవడంతో పైరు కుళ్లిపోయింది. దీంతో పెట్టుబడులు కోల్పోయామని రైతులు వాపోతున్నారు. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో కాస్త ముందస్తుగా దాదాపు 400 ఎకరాల్లో మినుము పంట సాగు చేశారు. సకాలంలో ఎరువులు,పురుగు మందులు పిచికారీ చేసి, నీటితడులు అందించారు. పంట ఏపుగా పెరిగి కళకళలాడుతుండటం చూసి దిగుబడులపై రైతులు లెక్కలేసుకున్నారు. అయితే 80 రోజులు దాటినా పూత, పిందె వంటివి రాకపోవడంతో వారి ఆశలు ఆవిరయ్యాయి. స్థానిక వ్యవసాయ అధికారుల ద్వారా శాస్త్రవేత్తలను పిలిపించి పరిశీలింపజేయించారు. విత్తనాలు నకిలీవి కావడంతో దిగుబడులు రాలేదని వారు తేల్చి చెప్పారు. చేసేదిలేక పంటను దున్నేశారు. వెంటనే జొన్న పంట సాగు చేసి గట్టెక్కారు .

రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడికి గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– నంద్యాల ఆర్అండ్‌బీ రహదారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడు గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు.. శిరువెళ్లకు చెందిన బాలస్వామి, ఆయన కుమారుడు అఖిల్ పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పెయింటింగ్ పని నిమిత్తం కోవెలకుంట్లకు వచ్చిన వారు పని ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి తిరిగి వెళ్తున్నారు. నంద్యాల వైపు నుంచి జమ్మలమడుగు వైపు వెళ్తున్న స్కార్పియో వాహనం మండలంలోని జోళదరాశి గ్రామ సమీపంలో బైక్‌ను ఢీకొట్టింది. బాలస్వామికి కాలు నుజ్జుకాగా అఖిల్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులకు కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం నంద్యాలకు తరలించారు. ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయండి

నంద్యాల అర్బన్: గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు అందించాలని ఎంపీడీఓ సౌభాగ్యం తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అతిసారం లాంటి వ్యాధులు ప్రబలకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ నరేంద్ర, ఏఓ శాను పాల్గొన్నారు.